ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబరాలు 8లో..
జియో థర్మల్ వైపు సింగరేణి అడుగులు.. 8లో..



నియోజకవర్గ అభివృద్ధికి నిధులేవి?

- సీడీఎఫ్ పథకం ఉన్నట్లా.. లేనట్లా..?
- 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేటాయింపులు నిల్..
- ఎస్‌డీఎఫ్ నుంచే ఎమ్మెల్యేలకు నిధులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అసెంబ్లీ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతి ఏటా 'నియోజకవర్గ అభివృద్ధి నిధి' పథకం కింద ఐదు కోట్ల రూపాయలను కేటాయిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటివరకు కూడా ప్రభుత్వం సీడీఎఫ్ నుంచి నిధులు కేటాయించకపోవడంతో ఆ పథకం ఉన్నట్లా, లేనట్లా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పటి నుంచి అమల్లో ఉంది. మొదట ఈ పథకం ద్వారా ప్రతి ఏటా 50 లక్షలు ఇవ్వగా, తర్వాత 75 లక్షలకు, ఆ తర్వాత కోటి 50 లక్షలకు పెంచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కోటి 50 లక్షల రూపాయలు ఉన్న సీడీపీఎఫ్ నిధిని 3 కోట్ల రూపాయలకు పెంచారు. 2018 నుంచి 5 కోట్ల రూపాయలకు పెంచారు. గత ఏడాది నవంబర్ చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది అధికారాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి నిధి పథకం ద్వారా 10 కోట్ల రూపాయల చొప్పున కేటాయించారు. ఇందులో తాగునీటి అవసరాల కోసం ఒక కోటి, పాఠశాలల్లో మౌలిక వసతులకు 2 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాల మరమ్మతుల కోసం 50 లక్షల రూపాయలు, మిగతా 6 కోట్ల 50 లక్షల రూపాయలను ఇతరత్రా అభివృద్ధి పనులకు వెచ్చించాలని పేర్కొన్నారు. ఈ పనులన్నింటికీ ఇన్‌చార్జీ మంత్రి ఆమోదం ఉండాలని పేర్కొన్నారు. ఎస్‌డీఎఫ్ కింద నియోజకవర్గాలకు నిధులకు కేటాయించిన ప్రభుత్వం సీడీఎఫ్ కింద నిధులు కేటాయించ లేదు.

● బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడంతో..

ప్రతి ఏటా ఏప్రిల్ నుంచి ఆర్థిక సంవత్సరం మొదలు కానుండడంతో జూన్ 6వ తేదీ వరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఆ తర్వాత కూడా నిధులను ప్రకటించకపోగా, గడిచిన నెల 25న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సీడీఎఫ్ కోసం నిధుల కేటాయింపు లేకపోవడంతో అనుమానాలు తలెత్తుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గెలుపొందిన ఎమ్మెల్యేలు అనేక హామీలు గుప్పించారు. గ్రామాల్లో మురికి కాలువలు, సీసీ రోడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, తాగునీటి పనులు, కమ్యూనిటీ హాళ్లు, విద్యుద్దీకరణ పనులు, తదితర పనులకు సీడీఎఫ్ నిధులు ఎంతగానో ఉపయోగపడుతుంటాయి. అయితే సీడీఎఫ్ నిధులు ఎమ్మెల్యేలకు ధైర్యానిస్తాయి. కానీ ఆ నిధుల కేటాయింపు లేకపోవడంతో పట్టణాలు, గ్రామాల్లో చిన్నచిన్న పనులు జరగకుండాపోతాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కో నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయలను ఎస్‌డీఎఫ్ కింద కేటాయిస్తే, ఈ నిధులు సీడీఎఫ్ నిధులకు అదనమని మురిసి పోయారు. కానీ కేటాయింపులు లేకపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరానికి నిధులు ఇస్తారా, లేదా అనే విషయం తేలడం లేదు. ప్రస్తుతం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 5 కోట్ల రూపాయల నిధులు ఇస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ఆ నిధులు వచ్చినట్లయితే జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 15కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరగనున్నాయి. అయితే ప్రభుత్వం సీడీఎఫ్ కింద ఈ ఏడాది నిధులను కేటాయిస్తుందా లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి.

డీఎస్సీ పరీక్షకు 451 మంది అభ్యర్థులు హాజరు

పెద్దపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన డీఎస్సీ పరీక్షకు 451 మంది అభ్యర్థులు హాజరయ్యారు. శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ నియామకాల డీఎస్సీ పరీక్షకు మొత్తం 550మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 451 హాజరయ్యారని, మంథని జేఎన్టీయూలో 200 మంది అభ్యర్థులకు 163 మంది అభ్యర్థులు, పెద్దపల్లిలోని మదర్ థెరీసా ఇంజనీరింగ్ కళాశాలలో 170 మంది అభ్యర్థులకు 141 మంది అభ్యర్థులు, ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 180 మంది అభ్యర్థులకు 147 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యా శాఖ పరంగా ఒక అబ్జర్వర్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, శుక్రవారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో ఆ ప్రకటనలో తెలిపారు.

పెండింగ్ భూ సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్



పెండింగ్ ఫైళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

ఎలిగేడు, ఆగస్టు 2 : మండలంలోని పెండింగ్ భూసమస్యలను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఎలిగేడు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో ఉన్న పెండింగ్ ధరణి సమస్యలు, భూసేకరణ, వివిధ సర్టిఫికెట్ల జారీ మొదలగు అంశాలపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మండలంలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో అవసరమైన ధ్రువీకరణ చేపట్టి పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి జారీ చేయాలని ఆయన సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆరణలో వనమహోత్సవం కార్యక్రమం కింద మొక్కలు నాటారు. మండల తహసీల్దార్ స్వర్ణ, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ జయలక్ష్మి, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో పెరిగిన శిక్షల శాతం : సీపీ

కోల్‌సిటీ, ఆగస్టు 2: రామగుండం పోలీస్ కమిషరేట్‌లో నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు వేయించేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గోదావరిఖని వన్‌టౌన్, రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కేసులలో నలుగురు నిందితులకు యావజ్జీవ కారాగారశిక్ష పడింది. ఏడు నెలల కాలంలో కేసుల్లో శిక్షల శాతం పెరిగినట్టు రామగుండం పోలీస్‌కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలో వరకట్న హత్య కేసులో గోదావరిఖని హనుమాన్‌నగర్‌కు చెందిన మృతురాలి భర్త బిస్స రాజు, అత్త బిస్స దుర్గమ్మకు జీవిత ఖైదు పడింది. అలాగే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్మడి శ్రీకాంత్‌కు జీవిత ఖైదు పడింది. రామగుండం ముబారక్‌నగర్‌లో సమ్మెట బాలమ్మ హత్య కేసులో నగునూరి నరేష్, సమ్మెట తిరుపతిలకు జీవత ఖైదు పడింది. అలాగే రెండు కేసులలో నలుగురు నిందితులకు నాలుగు సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ.4500జరిమానా విధించారు. ఐదు కేసుల్లో ఐదుగురు నిందితులకు మూడు సంవత్సరాల కారాగార శిక్ష, రూ.11,200 జరిమానా విధించారు. ఒక కేసులో రెండు సంవత్సరాలుగా శిక్ష పడిందని తెలిపారు. 13కేసుల్లో 23మంది నిందితులకు ఏడాది జైలుశిక్ష, రూ.9వేల జరిమానా విధించారు. 15కేసుల్లో 23మంది నిందితులకు ఏడాదిలోపు జైలు శిక్ష, రూ.3400జరిమానా విధించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో 8208 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు కాగా 1652కేసుల్లో రూ.2,4,33,500 జరిమానా విధించారు. 11మందికి జైలు శిక్ష విధించినట్టు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

అనధికార గృహాల నిర్మాణంపై ఆర్డీవో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

రామగిరి, ఆగస్టు 2: మండలంలోని బుధవారంపేట్ గ్రామపంచాయతీ రెవెన్యూ శివారు రాజాపూర్‌లో అనధికార గృహ నిర్మాణాలపై శుక్రవారం సింగరేణి అధికారులు, ఎంపీడీవో, పోలీస్‌శాఖలు సంయుక్తంగా మంథని ఆర్డీవో హనుమానాయక్ తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారంపేట్ గ్రామంలోని సింగరేణి సేకరించిన 88.20 గుంట భూమిలో అనుమతి లేకుండా నిర్మించిన 51 అనధికార గృహల నిర్మాణ అనుమతులపై ప్రధానంగా చర్చించారు. అనధికార గృహ నిర్మాణాల అనుమతులపై ఎంపీడీవో శైలజారాణి, పంచాయతీ కార్యదర్శిని ఆర్డీవో ప్రశ్నించారు. నిర్మాణం చేపట్టన గృహాల వారి వద్ద ఉన్నా ఆధారాలు పరిశీలించాలని ఆదేశాలు జారీచేశారు. 88.20 గుంటల భూమిలో 5.08 గుంటల మినహాయించి మిగతా భూమి సింగరేణి ఆధీనంలో ఉందని ఎస్టేట్ అధికారి ఐలయ్య సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎస్ఐ సందీప్, డీటీ మానస, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ, ఎస్టేట్ అధికారి శ్యామల, ఎండి షబ్బీర్‌పాషా, ఆర్ఐలు మహేష్‌బాబు, నిహారిక, పంచాయతీ సెక్రెటరీ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలకు దూరం

- జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత



గంగారంలో నాలాను పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 2: పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలకు దూరంగా ఉంటామని డీపీవో ఆశాలత అన్నారు. మండలంలోని గంగారం గ్రామంలో శుక్రవారం పలువాడలను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమలు దరిచేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ తదితర జ్వరాల బారిన ప్రజలు పడకుండా శానిటేషన్, ఫాగింగ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహనచారి, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి షబ్బీరుద్దీన్, మాజీ సర్పంచ్ ఈద సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కిరాణం షాపు సీజ్..

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 2 : మండలంలోని మారేడుగొండ గ్రామంలో స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా పంచాయతి శాఖ అధికారిణి ఆశలత శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా వీధుల్లో , ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, మురికి కాలువల్లో చెత్త చెదారం ఉంటే తక్షణమే తొలగించాలని డీపీవో అధికారులకు సూచించారు. ఇంటి పరిసరాలు, దుకాణ సముదాయాలు, జనాలు గుమిగూడే ప్రాంతాల్లో శుభ్రత పాటిస్తేనే సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ఉంటాయన్నారు. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. గ్రామంలో ఓ కిరాణం దుకాణ సముదాయంకు వెళ్లి పరిశీలించి పరిసర ప్రాంతం పూర్తిగా అపరిశుభ్రతగా ఉండటంతో దుకాణాన్ని సీజ్ చేసి జరిమానా విధించారు. వెంట పంచాయతీ కార్యదర్శి రవి, సిబ్బంది ఉన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పెండ్రు రమ

మంథని, ఆగస్టు 2: మున్సిపల్ పరిధిలోని బోయినిపేటలో ఉన్న ముదిరాజ్ కులస్థుల అభివృద్ధి, సంక్షేమం కోసం మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో కృషి చేస్తానని చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి అన్నారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రమ-సురేష్‌రెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ముదిరాజ్ కులస్థులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్పొరేటర్ నిరసన

కోల్‌సిటీ, ఆగస్టు 2: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం ముందు శుక్రవారం 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీష్ నల్ల కండువా ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ డివిజన్‌లో పారిశుధ్యం, వీధిదీపాలు, తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందన్నారు. పట్టణంలో నాలుగు డివిజన్లకు ఒకటే ట్రాలీ ఉందని, వీధిదీపాల సమస్య తీవ్రంగా ఉందని, డివిజన్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో తాగునీటి సరఫరా జరుగ డంలేదన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా కనీసం స్పందించడం లేదన్నారు. కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ వచ్చి సోమవారం వరకు ఆటో ట్రాలీని, అదనపు ట్రాక్టర్‌ను ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు.

ఆర్ఎఫ్‌సీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ బదిలీ

కోల్‌సిటీ, ఆగస్టు 2: ఆర్ఎఫ్‌సీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సుధీర్ కుమార్ ఝాకు ఈడీగా పదోన్నతి లభించింది. నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్‌కు చెందిన హర్యానలో పాణిపట్టు యూనిట్‌కు ఆయన బదిలీ అయ్యారు. సుధీర్ కుమార్ ఝా 2016 ఆగస్టు 1న ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఏజీఎంగా విధుల్లో చేరి ఇక్కడే జీఎంగా, సీజీఎంగా ఇక్కడే పదోన్నతి పొందారు. ఈడీగా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం(ఓఅండ్ఎం) ఉదయ్‌రాజ్ హన్సకు ఇన్‌చార్జ్ సీజీఎంగా నియమించారు. ఈడీగా పదోన్నతి పొందిన ఝాను ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' పక్కా కార్యాచరణతో నిర్వహించాలి

- ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించాలి - కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 2: జిల్లాలో స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని పక్కా కార్యాచరణతో నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను అమలుచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. ఆగస్టు 5నుంచి 9వరకు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం కింద గ్రామాలు, పట్టణాలలో చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలు, షెడ్యూల్‌ను అదనపు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ మాట్లాడుతూ స్వచ్ఛదనం, పచ్చదనం కింద పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, మురికి కాల్వలను, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలను పూడ్చడం, సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధి కుక్కల దాడుల నివారణ చర్యలు, డ్రై డే, ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు పక్కాగా అమలుచేయాలన్నారు. జిల్లాలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించాలని, కొంతమంది పంచాయతీ కార్యదర్శులు ఇతర సిబ్బంది ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేశారని, గ్రామాల్లో ఉన్న మల్టీపర్పస్ వర్కర్లను వినియోగించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో ఉన్న సెగ్రిగేషన్ షెడ్, డంపింగ్ యార్డ్‌లను వినియోగంలోకి తీసుకరావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, మార్కెట్ మొదలగు పబ్లిక్ ప్లేసెస్ శుభ్రం చేయాలని, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. జిల్లావ్యాప్తంగా కూలిపోయే స్థితిలో ఉన్న ప్రభుత్వ భవనాలను స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా తొలగించాలని తెలిపారు. జిల్లాలో నిర్వహించే శ్రమదానం కార్యక్రమానికి కనీసం 50మంది పాల్గొనేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో ఉన్న రోడ్ల గుంతలను పూడ్చివేయాలని, అవసరమైన రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయాలని, దీనిపై ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలతో ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. దోమల నియంత్రణ కోసం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, నీరు నిల్వఉండకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారంచేయాలని, అదేవిధంగా మురికికాలువలో, అధికంగా ఉన్న ప్రాంతాల్లో దోమలు రాకుండా ఆయిల్‌బాల్స్ వేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటే మొక్కలు తప్పనిసరిగా ఎత్తైనవి ఉండాలని, చాలా చోట్ల ఎత్తు తక్కువ ఉన్న మొక్కలు ఉన్నాయని, అధికారులు ఆ మొక్కలు రిప్లేస్ చేయాలని సూచించారు. తాగునీటి సరఫరా నాణ్యత పరీక్షలను రెట్టింపు చేయాలని. జిల్లాలోని రెసిడెన్షియల్ గురుకుల విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టల్ లో పారిశుధ్యం మరింత మెరుగ్గా అమలు చేయాలని, వీటిని మండల ప్రత్యేక అధికారులు తనిఖీ చేసి అక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశా లత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కే రవీందర్, మున్సిపల్ కమిషనర్‌లు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా అటవీ అధికారి శివయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఆగస్టు 2: సింగరేణిలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని, వారికి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జీవో నంబర్ 22ను అనుసరించి వేతనాలు చెల్లించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసెంబ్లీలో సింగరేణి, ఎన్‌టీపీసీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్య లపై ఆయన మాట్లాడారు. పర్మినెంట్ కార్మికులకు రూ.లక్ష వరకు వేతనాలు వస్తున్నాయని, అదే పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రూ.10వేల వేతనాల రావడం లేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వా లని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని, ఈ తీర్పును అను సరించి వెలువడిన జీవో నెం.22ను అమలుచేయాల న్నారు. అలాగే రామగుండం రూరల్ పరిధిలోని రెం డు మండలాల్లో గతంలో భూ స్వామ్యుల భూముల ను సాదాబైనాలపై కొనుగోలు చేసిన రైతులకు అన్యాయం జరిగింద ని, ధరణి పోర్టల్‌లో మళ్లీ భూస్వామ్యులు, వారి కుటుంబ సభ్యుల పేర్లే వస్తున్నాయని, దీన్ని సవరించాలని ఆయన కోరారు.

హకీంపేటలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయండి..

హైదరాబాద్ శివారులోని హకీంపేటలో ప్రస్తుతం ఉన్న స్పోర్ట్స్ అకాడమీ స్థానంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. శుక్రవారం క్రీడలపై అసెంబ్లీలో మాట్లాడిన ఆయన పలు అంశాలను లేవనెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇద్దరు క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఉద్యోగాలు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో క్రీడారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, అది కోమాలోకి వెళ్లిపోయిందన్నారు. తాను శాప్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ క్రీడారంగాన్ని ఎంతో ప్రోత్సహించారని, ఇందుకు అప్పటి యూత్ మినిష్టర్‌గా ఉన్న హరీష్‌రావే సాక్ష్యమన్నారు. తాము 36 అకాడమీలను నడిపించామని, 38 అంతర్జాతీయ ఈవెంట్స్, వెయ్యి నేషనల్ ఈవెంట్స్ చేశామన్నారు. నియోజకవర్గాల స్థాయిలో ప్రతి స్కూల్‌లో క్రీడా ప్రాంగణం ఉంటే విద్యార్థి దశనుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని, నియోజకవర్గానికి ఒక స్టేడియంను ఏర్పాటు చేయాలన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏషియన్ గేమ్స్ నిర్వహించారని, తరువాత స్టేడియాలు మూతపడ్డాయన్నారు. గ్రామాల్లో క్రీడాస్ఫూర్తి ఉన్నవారిని గుర్తించి ప్రోత్సహించాలని, మెటీరియల్, స్పోర్ట్స్ షూస్ అందించాలన్నారు. శామీర్‌పేట, హకీంపేటలో 250 ఎకరాల్లో స్పోర్ట్స్ అకాడమీ ఉందని, అక్కడ 11 స్టాండర్డ్ చదువుల తరువాత జాతీయ క్రీడాకారులుగా తయారవుతున్నారన్నారు. వీరిపై ఒక్కొక్కరిపై రూ.2.5లక్షలు ఖర్చు చేస్తున్నారని, వారు బయటకు వచ్చిన తరువాత సరైన పోషకాహారం లేక రాణించడంలేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో అంతర్జాతీయ హబ్‌గా ఉంటుందని, 2032 ఒలంపిక్స్ ఇండియాకు రానున్నందున దానిని ఇతర రాష్ట్రాలకు పోనివ్వకుండా హైదరాబాద్‌లో నిర్వహించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు.

ఖనిలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఐ నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మార్కండేయకాలనీ, ఆగస్టు 2: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన వ్యాపార కేంద్రాలైన కళ్యాణ్‌నగర్, లక్ష్మీనగర్‌లలో అసంపూర్ణంగా ఉన్న రోడ్లను వెంటనే నిర్మించాలని, మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో గుంతల రోడ్లపై గులాబీ పూలు చల్లుతూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజ్, జిల్లా మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్‌లు, తాళ్లపెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, మడికొండ ఓదేమ్మ, శనిగరపు చంద్రశేఖర్, మార్కపురి సూర్య, రేణికుంట్ల ప్రీతం, ఎర్రల రాజయ్య, ఆసాల నవీన్, అబ్దుల్ కరీం, చిలుముల రాజయ్య, గంగారపు చంద్రయ్య, జెర్రిపోతుల దేవయ్య, జగదీశ్వర్, జైపాల్‌రెడ్డి, రోంటాల లింగయ్య, బీ విజయ, తిరుమల, రేణుక, రాజమ్మ, రాధమ్మ, మహేందర్‌రావు పాల్గొన్నారు.





ఏడుగురిపై వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, ఆగస్టు 2: భర్త తరుపు కుటుంబీకులు అదనపు వరకట్నం కోసం వేదిస్తున్నారని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. జమ్మికుంటకు చెందిన రమ్యకు హైదరాబాద్‌కు చెందిన కొల్లోజు శ్రీనివాసచారితో 2010 సంవత్సరంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్న కానుకల కింద తమ పుట్టింటి వారు రూ.2.50లక్షల నగదు, పది తులాల బంగారు ఆభరణాలు ముట్ట చెప్పారు. వారికి ఒక కుమారుడు జన్మించాడు. కొంత కాలం తర్వాత అత్తింటి వారి నుంచి వేధింపులు మొదలయ్యాయి. భర్త శ్రీనివాసచారి, మామ ఆంద్రయ్య, అత్త సుశీల, బావ సత్యనారాయణ, తోటి కోడళ్ల మమత, నిత్య, మరిది దేవేందర్‌లు అదనపు వరకట్నం కోసం వేధించారని బాధితురాలు రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

గంభీరావుపేటలో దొంగతనం


ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు


గంభీరావుపేట, ఆగస్టు 2 :మండల కేంద్రంలోని దుద్దె డి విజయ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బీరువా పగుల గొట్టి రెండు తులాలన్నర బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి ఎత్తు కెళ్లారు. విజయ అత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో చనిపోయింది. ఇల్లు వీడాలని చెప్పడంతో విజయ కుటుంబం వేరే ఇంట్లో అద్దెకు ఉంటోంది. ప్రతీ రోజు ఉదయం సొంతింటికి వచ్చి ఇంటి పనులు చేసి తిరిగి అద్దె ఇంటికి వెళ్తోంది. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగుల గొట్టి ఉంది. బీరువా తెరిచి, వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. పోలీస్‌లకు సమాచారం అందించడంతో ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, ఎస్సై రాంమోహన్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ టీం బృందం ఇంటి పరిసరాలను పరిశీలించింది.




















ఎస్‌యూ డిగ్రీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 2: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్, జూన్, 2024లో (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) నిర్వహించిన 2, 4, 6వ సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను శుక్రవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలు www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గొల్లపల్లి, ఆగస్టు 2: గొల్లపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో గత నెల కూల్ డ్రింక్ అనుకుని ప్రమాదవశాత్తు గడ్డి మందు తాగిన బొలిశెట్టి ప్రభాకర్ (39) పదకొండు రోజుల అనంతరం పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 22న రాజు శ్రీనివాస్ అనే రైతు పొలంలో వరి నారు లాగేందుకు ప్రభాకర్ వెళ్లాడు. మధ్యాహ్నం వేళలో ఒడ్డు పై ఉన్న థమ్సప్ బాటిల్‌లో పొరపాటున కూల్ డ్రింక్ అనుకుని ప్రమాదవశాత్తు గడ్డి మందు తాగాడు. గమనించిన తోటి స్నేహితులు హుటాహుటిన వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేట్ వాహనంలో జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుడి సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించి అక్కడ రెండు రోజుల పాటు వైద్యచికిత్సలు చేయించారు. అయితే, అక్కడి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయిస్తున్నారు. అయితే, పదకొండు రోజులు అనంతరం పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, పాప, బాబు ఉన్నారు. మృతుడి తల్లి బొలిశెట్టి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గండాలు దాటనున్న గౌరవెల్లి


గౌరవెల్లి రిజర్వాయర్

- రిజర్వాయర్ పెండింగ్ పనుల పూర్తికి కేబినెట్ ఆమోదం
- రూ.437 కోట్ల విడుదలకు నిర్ణయం
- 17 ఏళ్ల కల సాకారమవుతోందని రైతుల సంతోషం

హుస్నాబాద్, ఆగస్టు 2: మెట్ట ప్రాంత వరప్రదాయిని గౌరవెల్లి రిజర్వాయర్ గండాలు ఇక తొలగిపోనున్నాయి. ఇక్కడి పొలాల్లో గోదావరి జలసవ్వడులను చూడాలనే ఈ ప్రాంత రైతాంగ నిరీక్షణ ఫలించబోతుంది. 17 ఏళ్ల క్రితం నుంచి ఈ రిజర్వాయర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు రిజర్వాయర్ పనులు పూర్తయి నీటిని నింపే అవకాశం ఉన్నా వ్యవసాయ భూములకు నీరందించే కాలువలు లేక.. రిజర్వాయర్ ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించకపోవడంతో పెండింగ్‌లోనే ఉంటూ వస్తున్నది. ఈ క్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎన్నికల్లో గెలిచిన వెంటనే రిజర్వాయర్‌ను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్ గౌరవెల్లి రిజర్వాయర్ పెండింగ్ పనుల పూర్తికి సవరించిన అంచనా ప్రతిపాదనల ప్రకారం రూ.437 కోట్లు కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. ఇక గౌరవెల్లి రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతాయని రైతులు సంతోషపడుతున్నారు.

2007లో శంకుస్థాపన

వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం సాగించే మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజకవర్గాలతో పాటు వరంగల్ జిల్లాలోని పలు గ్రామాలకు సాగు నీరందించాలని శ్రీరాంసాగర్ ఇందిరమ్మ వరదకాలువ గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ల నిర్మాణానికి 2007 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హుస్నాబాద్‌లో శంకుస్థాపన చేశారు. ఒప్పందం ప్రకారం ఈ రిజర్వాయర్ల పనులు ఐదేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా రీ డిజైన్ ఇతర కారణాలతో 17 ఏళ్లుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ ఈ రిజర్వాయర్‌ను సందర్శించి దీనిని రీడిజైన్ చేశారు. 1.4 టీఎంసీలు ఉన్న గౌరవెల్లి రిజర్వాయర్ ను 8.23 టీఎంసీలకు పెంచారు. దీంతో అదనంగా భూసేకరణ చేయాల్సి వచ్చింది. ఎలాంటి అనుమతులు లేకుండా రిజర్వాయర్ ఎత్తు పెంచారని నిర్వాసితులు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఇప్పటికీ కూడా ఎన్‌జీటీలో ఈ కేసు ఉంది.


రిజర్వాయర్‌లోకి వస్తున్న నీరు(ఫైల్)

పూర్తయిన ట్రయల్ రన్

8.23 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లోకి 2 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే 32 మెగావాట్ల సామర్థ్యం ఉన్న చైనా నుంచి వచ్చిన మూడు మోటార్లను బిగించారు. 2022 జూలై 31వ తేదీన అందులోని ఒక మోటార్‌తో 10 నిమిషాల పాటు ట్రయల్ రన్ నిర్వహించారు. మరో రెండు రోజుల అనంతరం అధికారులు రెండో మోటారు, మరో రెండు రోజులకు మూడో మోటారు ట్రయల్‌రన్ చేశారు. గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి నీటిని మిడ్‌మానేరు ద్వారా బెజ్జంకి మండలం తోటపల్లి ఆన్‌లైన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి తీసుకవస్తారు. మొదటి డిజైన్ ప్రకారం రూ.409 కోట్లతో చేపట్టిన ఈ సొరంగం పనులు పూర్తయిన అనంతరం రీ డిజైన్‌లో భాగంగా అదనంగా మరో రూ.380 కోట్లతో పనులు చేశారు. తోటపల్లి ఆన్‌లైన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 16 కిలోమీటర్ల దూరంలో రేగొండ వద్ద గౌరవెల్లి రిజర్వాయర్ ఉంటుంది. ఇందులో 12 కిలోమీటర్ల మేర సొరంగం ఉంటుంది. 5.6 మీటర్ల టన్నెల్‌షిప్‌తో 32 క్యూబిక్‌తో నీటిని తీసుకెళ్లే విధంగా సొరంగం నిర్మించారు. 50 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పు, 110 మీటర్ల లోతుతో సర్జ్‌పూల్ (నీళ్ల సంపు), 61మీటర్ల పొడవు, 17 మీటర్ల వెడల్పు, 130 మీటర్ల లోతుతో పంపుహౌజ్‌ను నిర్మాణం చేశారు. ట్రయల్ రన్‌తో రిజర్వాయర్‌లో ఒక టీఎంసీ నీటిని కూడా నింపారు.

1.06 లక్షల ఎకరాలకు సాగు నీరు

గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తయితే 1.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. హుస్నాబాద్ నియోజకవర్గంలో 57,852 ఎకరాలు, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 48, 148 ఎకరాలకు సాగునీరందుతుంది. ఈ రిజర్వాయర్‌కు రెండు ప్రధాన కాలువలు ఉండగా కుడి కాలువ ద్వారా 90 వేల ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 16వేల ఎకరాలు సాగవుతాయి.



రాబోయే సీజన్‌లో గౌరవెల్లి ద్వారా నీరందిస్తాం
: మంత్రి పొన్నం ప్రభాకర్

రాబోయే సీజన్‌లోపు గౌరవెల్లి ద్వారా సాగు నీరందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాలువలకు సంబంధించి రూ.437 కోట్లు బడ్జెట్‌లో ఆమోదించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారని, అప్పుడే 80 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత కుర్చీ వేసుకొని ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పి పదేళ్లయినా పట్టించుకోలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితులపై నిరంకుశత్వంగా వ్యవహరించిందని గుర్తుచేశారు. ఇక కాలువల నిర్మాణం వేగం చేస్తామని చెప్పారు.

వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు త్వరగా మంజూరు చేస్తున్నాం

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, ఆగస్టు 2: రైతులకు త్వరగా వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ) వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది 689 సర్వీసులను మంజూరు చేయగా, ఈ ఏడాది 937 సర్వీసులను మంజూరు చేశామని తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే 248 సర్వీసుల మంజూరు(36 శాతం) పెరిగిందని అన్నారు. సర్వీసుల మంజూరు మొత్తం ఆన్‌లైన్ చేయడం ద్వారా ఎప్పటికప్పుడు దరఖాస్తు ఎక్కడ పెండింగ్ ఉంది, ఎవరి దగ్గర పెండింగ్ ఉంది దానికి గల కారణాలను సవివరంగా అగ్రికల్చర్ పోర్టల్ (ఆన్‌లైన్)లో చూసుకునే వెసులు బాటు ఉందన్నారు. దీని ద్వారా మంజూరులో ఆలస్యం లేకుండా తొందరగా మంజూరు అవుతున్నాయని అన్నారు.

అలాగే ఈ- స్టోర్స్ విధానం ప్రవేశపెట్టడం ద్వారా కావాల్సిన మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకొని మెటీరియల్‌ను కావాల్సిన సమయంలో తీసుకొని పనులు ప్రారంభిం చవచ్చన్నారు. పేపర్ పనిలేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం విద్యుత్ శాఖకు, రైతులకు ఎంతో మేలు చేకురుతుందని చెప్పారు. అలాగే ఒక పనికి సంబంధించిన మెటీరియల్ ఏమైనా మిగిలి ఉంటే వేరే పనికి పేపర్ ట్రాన్సాక్షన్ ద్వారా మార్చుకొనే వెసులు బాటు మొత్తం కూడా ఆన్‌లైన్‌లోనే చేశామని తెలిపారు. ఈ పద్ధతి వలన కూడా ఎంతగానో సమయం ఆదా అవుతుందని వివరించారు. ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యాన్ని కూడా పెంచామని, వంగిన పోల్‌లు, లూస్ లైన్‌లను కూడా సరి చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ అధికారులు రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. రైతులకు వ్యవసాయ సర్వీసుల మంజూరుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని వెనువెంటనే మంజూరు చేసేందుకు ఆహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు .

విష జ్వరంతో మహిళ మృతి


శ్రీలత (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 2: పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన శనిగరపు శ్రీలత (35) విష జ్వరంతో గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల చెప్పిన వివరాల ప్రకారం.. శనిగరపు శ్రీలత ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతూ జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నా తగ్గపోవడంతో హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం మృతిచెందింది. మృతురాలికి భర్త శ్రీనివాస్, ఇద్దరు కుమారులు హర్ష, సూర్య ఉన్నారు.

యువతిపై అత్యాచారయత్నం: కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 2: కరీంనగర్‌లో కోతిరాంపూర్‌లో మంచిర్యాల జిల్లాకు చెందిన యువతి (20)పై రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామన్నపేటకు చెందిన చింతం వంశీకృష్ణ(21) అత్యాచార యత్నం చేశాడని కరీంనగర్ ఒకటో టాణా పోలీసులు తెలిపారు. కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్న వంశీకృష్ణ కొద్దిరోజుల కిందట యువతితో పరిచయం పెంచుకుని గురువారం ఆమెను కరీంనగర్‌కు రావాలని కోరాడు. ఆమె కరీంనగర్‌కు వచ్చిన సమయంలో అత్యాచారయత్నం చేవాడని బాధితరాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అత్యాచారయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నిందితుడికి 8నెలల జైలు శిక్ష

హుజూరాబాద్, ఆగస్టు 2: ఓ మహిళ ఇంట్లోకి చొరబడి చంపుతానని బెదిరించిన వ్యక్తికి జడ్జి ఎనిమిది నెలల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన ప్రకారం.. ఫిబ్రవరి 2, 2024న హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఓ మహిళ ఇంటి పక్కనే ఉండే బుర్ర చక్రపాణి అకారణంగా ఆమె ఇంట్లోకి చొరబడి కత్తితో చంపుతానంటూ తల వెంట్రుకలు పట్టుకొని బెదిరించాడు. దీంతో మహిళ హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని విచారణ జరిపి, కోర్టులో చార్జిషీటు వేశారు. కోర్టులో ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం జడ్జి శ్రీసాయిపద్మ నిందితుడికి 8 నెలల జైలు శిక్షతో పాటు రూ.300జరిమానా విధించారు.

నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, ఆగస్టు 2: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామ కమాన్ వద్ద సిద్దిపేటకు చెందిన వల్లెపు దేవదాస్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. అనంతగిరికి చెందిన గొల్లపల్లి రమేష్ ద్విచక్రవాహనం గురువారం చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. శుక్రవారం వాహనాల తనిఖీ చేస్తుండగా దేవదాస్‌ను పట్టుకున్నట్లు, అతడిపై సిద్దిపేటలో రెండు కేసులు ఉన్నట్లు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మేడిపల్లి, ఆగస్టు 2: మేడిపల్లి గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్న మ్యా కల శేఖర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మరిపెల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన శేఖర్ వ్యక్తి కిరాణం నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. అత్యాశతో అధిక డబ్బు సంపాదించాలనే మోజులో పడి తక్కువ ధరకు గంజాయిని విక్రయించి ఎక్కువ ధరకు యువతకు విక్రయించాలని మేడిపల్లి, కొండాపూర్ పరిసరాల్లోని యువతనుకు గంజాయి అమ్మేందుకు వచ్చాడు. ఈ సమాచారం పోలీసులకు అందడంతో ఎస్పీ ఆదేశాల మేరకు దాడి చేసి అతడిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 565 కిలోగ్రాముల గంజాయి మోటర్‌సైకిల్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు, కోరుట్ల సీఐ సురేష్ బా బు, ఎస్సై శ్యామ్‌రాజ్, సిబ్బంది దినేష్, అనిల్, చందు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సురేశ్‌గౌడ్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన యువకుడు లింగాల సురేశ్‌గౌడ్ (28) మండల కేంద్రం శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. గ్రామంలోని సురేశ్‌గౌడ్ ఉపాధి నిమిత్తం కొలంగా మహారాష్ట్రకు వలస వెళ్తుండేవాడు. ఈ నెల 1న స్వగ్రామానికి చేరుకున్నాడు. శుక్రవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తున్న క్రమంలో కింద పడిపోయి చనిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్ పరిశీలించారు. గుండెపోటుతో మృతి చెందడా..? లేక వాహనం ఢీకొనడంతో చనిపోయడా.. అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి తల్లి ఎల్లవ్వ, భార్య స్వాతి, కూతురు రితన్యా, అన్విత్ లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య


స్రవంతి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో కడుపునొప్పి భరించలేక సకినాల స్రవంతి(28) అనే వివాహిత ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన స్రవంతికి నారాయణపూర్‌కు చెందిన సకినాల దేవరాజుతో పదేళ్ల కిందట వివాహమైంది. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఏడాది కిందట దేవరాజు ఉపాధి నిమిత్తం దుబాయి వలస వెళ్లాడు. కొంత కాలంగా స్రవంతి అనారోగ్యంతో బాధ పడుతోంది. గురువారం రాత్రి తాను కడుపునొప్పికి తాళలేకపోతున్నానని తండ్రి శంకరయ్యకు ఫోన్ చేసి చెప్పింది. తండ్రి రాత్రి నారాయణపూర్ చేరుకొని అడుగ గా కడుపునొప్పి భరించలేక ఎలుకల మందు తాగానని తెలిపింది. దీంతో ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి శంకరయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

అప్పుల బాధతో గొర్రెల కాపరి ఆత్మహత్య


రాజయ్య మృతదేహం

రామడుగు, ఆగస్టు 2: అప్పుల బాధతో ఓ గొర్రెల కాపరి ఆత్మహత్య చేసుకున్న ఘటన దేశరాజుపల్లిలో విషాదం నింపింది. ఎస్ఐ సురేందర్ కథనం ప్రకారం.. దేశ రాజుపల్లి గ్రామానికి చెందిన అమరగొండ రాజయ్య (53) గొర్లను మేపకుంటూ జీవిస్తున్నాడు. కుటుంబ పోషణలో భాగంగా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన రాజయ్య గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన గ్రామస్థులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య కనకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

జమ్మికుంట, ఆగస్టు 2: పాత పగలు మనసులో పెట్టుకుని తనతో పాటు భార్య, కుమారుడిపై ఓ కుటుంబం దాడి చేసిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీస్‌లు వారిపై కేసు నమోదు చేశారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన రేవెల్లి సమ్మయ్య, భార్య కనకమ్మ, కుమారుడు రాజేష్‌లపై తిరుపతి, స్వరూప, ప్రకాష్, సింధు, అరవింద్ అనే వ్యక్తులు పాత పగలు మనసులో పెట్టుకుని తమపై దాడి చేశారని బాధితుడు సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 2: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి ఏడో రోజు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా 12,600 ఎస్ఆర్ఆర్ మిడ్ మానేరు డ్యాంలోనికి తరలిస్తున్నారు. నీటి ప్రవాహంతో వరదకాలువ ఉప్పొంగుతూ ప్రవహిస్తుండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. వివిధ గ్రామాల ప్రజలు వరద కాలువ, గ్రావిటీ కాలువల నీటి ప్రవాహాన్ని తిలకిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

బోయినపల్లి: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12,600 క్యా సెక్కులు, మానేరు, ములవాగు ద్వారా 1890 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 311.080 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు 10.018 టీఎంసీల మేర నిల్వ ఉంది.

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 9 గంటల వరకు ప్రాజెక్టులోకి ఎగు వ ప్రాంతం నుంచి 7924 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.554 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.



గాయత్రి పంప్‌హౌస్ నుంచి వస్తున్న నీరు

బదిలీ కార్యదర్శికి సన్మానం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 2 : మండలంలోని సబ్బితం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన రవి ఇటీవల చేపట్టిన బదిలీల్లో అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లికి బదిలీ కాగా శుక్రవారం సబ్బితం గ్రామస్థులు రవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహేందర్, మాజీ సర్పంచ్ చుంచు సదయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఫీల్డ్‌అసిస్టెంట్ రమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

4న అంతర్ జిల్లాల స్థాయి ఈత పోటీలు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 2: కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం జిల్లాస్థాయి ఈత పోటీలునిర్వహిస్తున్నట్టు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, పురుషుల, వాటర్‌పోలో విభాగాల్లో పోటీలు జరుగుతాయని, ప్రతిభ కనపర్చిన వారు ఈనెల 18న సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు.

అన్నదానం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 2: గోదావరిఖనిలో నీడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలువురు నిరుపేదలకు, యాచకులకు శుక్రవారం అన్నదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు పల్లేర్ల రమేష్ పాల్గొన్నారు. అలాగే వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమానికి మామిడి స్వామి-స్వాతి దంపతులు 25కిలోల బియ్యాన్ని అందజేసి వృద్ధులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు పిటీస్వామి, కనుకుంట్ల రమేష్, కన్నూరి జైష్, బడికెల కృష్ణ, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి బియ్యం పంపిణీ

ఓదెల, ఆగస్టు 2 : మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ బూసారపు చిరంజీవి ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబానికి శుక్రవారం ధర్మకర్తల మండలి సభ్యుడు కనికిరెడ్డి సతీష్ 50కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతం మొగిలి, బోగె సదానందం, నాగపూరి పైడిద్దరాజు, శ్రీపతి మహేష్, మార్క రమేష్, వెంకటేష్, అనిల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి బాధ్యతల అప్పగింత

ఎలిగేడు, ఆగస్టు 2 : మండల పంచాయతీ అధికారిగా కేవీ మహేశ్వర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తుండగా అదనంగా ఎంపీవో బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఐదేళ్ల పనిచేసిన ఎంపీవో అనిల్‌రెడ్డి జూలపల్లి మండల పంచాయతీ అధికారిగా బదిలీపై వెళ్లారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పిట్టల వెంకటి, ప్రధాన కార్యదర్శి నంది నగేష్, ఎరుకల లింగమూర్తి, నూకల మొండయ్య, దాసరి రామస్వామి, కొండ కుమార్, ఎరుకల లక్ష్మణ్ రావు, దాసరి రమేష్, శీలం వెంకటి, నగేష్, వెంకటి పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 2 : మండలంలోని రాఘవపూర్, అప్పన్నపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, మండల విమల తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కాగా, దేవునిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు రిటైర్డ్ ఉద్యోగి రాజనరేందర్‌రెడ్డి ఆట వస్తువులు, చార్టులను అందించారు. అంగన్‌వాడీ టీచర్ రజిత పాల్గొన్నారు.

ఎలిగేడు, ఆగస్టు 2 : తల్లిపాలు పసిబిడ్డలకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్ జ్యోతి అన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఆరునెలల పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం దేవేంద్ర, శిరీష, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, ఆశ పద్మ, గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, ఆగస్టు 2: సుల్తానాబాద్ ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఏసీడీపీవో సంపత్ కుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, స్వరూప, ఏఎన్‌ఎంలు సరస్వతి, అంగన్ వాడీ టీచర్లు సుభాషిణి, మేఘమాల, అంజనీ, సరోజనీదేవీ, స్వర్ణ, భార్గవి, సునిత, శ్రీలత, వినోధ, శోభ తదితరులు పాల్గొన్నారు. బొంతకుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కూడా తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. పంచాయతీ సెక్రెటరీ శ్రీధర్, డాక్టర్ సంతోష్‌కుమార్, భూలక్ష్మీ, జూపల్లి శోభ, కవిత తదితరులు పాల్గొన్నారు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 2: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రొఫెసర్లు అరుణ, అప్పారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబరాలు



గోదావరిఖని ప్రధానచౌరస్తాలో బీజేపీ నేతల క్షీరాభిషేకం



ఎలిగేడులో ఎంఆర్‌పీఎస్ సంబరాలు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై గోదావరిఖనిలో శుక్రవారం దళిత సంఘాలు, పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించాయి. స్థానిక ప్రధానచౌరస్తాలో బీఆర్ అంబేద్కర్, ప్రధానమంత్రి మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ చిత్రపటాలకు బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కోడూరి రమేష్, స్వామి, గోపగోని నవీన్, భూమన్న, మిట్టపల్లి సతీష్, సుల్వ లక్ష్మీనర్సయ్య, కోమళ్ళ మహేష్, మచ్చ విశ్వాస్, పిడుగు కృష్ణ, బియ్యాల మహేష్, పెండెం సత్యనారాయణ, రాకేష్, కొమ్మస్వామి, భాస్కర్, అంజి, రాజు, నరేందర్, అపర్ణ, పద్మ, ప్రవీణ్ పాల్గొన్నారు. జీఎంకాలనీలోని బాహూజీనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడడు అడ్లూరి రాజేష్, మామిడి రాజేష్, కొమ్ము శ్రీనివాస్, సంపత్, మల్లేష్, వడ్డేపల్లి సదానందం, రాము పాల్గొన్నారు. టీడీపీ, మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు కోటగిరి పాపయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప్పులేటి పర్వతాలు, వడ్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు, ఆగస్టు 2 : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు న్యాతరి పోచయ్య, బాపయ్య, రమేష్‌లు పూలమాలలు వేసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కవ్వంపల్లి చంద్రయ్య, కొండయ్య, దుర్గయ్య, నారాయణ, బాసంపల్లి రాజేష్, వినోద్, ఆసంపల్లి అంజయ్య, లచ్చయ్య, చిలుముల లక్ష్మణ్, న్యాతరి సంపత్, శంకర్ రాము పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 2: వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం సింగరేణి మాదిగ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఓసీపీ-3 కృషి భవన్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో ఆకునూరి రాజయ్య, ఆషన్న, అయిలయ్య, రామన్న, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 2: మాదిగ ఉప కులాల రిజర్వేషన్ల సుప్రీం కోర్టు తీర్పుతో ముప్పై ఏళ్ళ కళ సహకారం అయ్యిందని మాజీ మంత్రి మోత్కుపెల్లి నర్సింహులు, మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్నీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

జూలపల్లి, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ మండల కేంద్రంలోని మాదిగ కుల సంఘం నాయకులు శుక్రవారం స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. మానుమండ్ల శ్రీనివాస్ నెరువట్ల సాగర్, గంగయ్య, మానుమండ్ల భూమయ్య, నెరువట్ల అంజయ్య, నెరువట్ల మల్లయ్య పాల్గొన్నారు.



మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల నిరసన

ఓదెల, ఆగస్టు 2 : అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని శుక్రవారం మండలంలోని సర్పంచ్‌లు హైదరబాద్‌లో సెక్రటేరియట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. నిరసనకు తరలివెళ్తున్న హరిపురం మాజీ సర్పంచ్ మధును పొత్కపల్లి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. పొత్కపల్లి మాజీ సర్పంచ్ ఆళ్ల రాజిరెడ్డి, జీలకుంట మాజీ సర్పంచ్ పత్తి మాలతి-సమ్మిరెడ్డితో పాటు ఉప్పరపల్లి మాజీ సర్పంచ్ పల్లె ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, ఆగస్టు 2: అసెంబ్లీ ముట్టడికి తరలివెళుతున్న పలువురు మాజీ సర్పంచ్‌లను సుల్తానాబాద్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిని మధ్యాహ్నం వరకు వదిలిపెట్టారు.

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 2: అసెంబ్లీ ముట్టడికి తరలివెళుతున్న మాజీ సర్పంచులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాసర్ల తిరుపతిరెడ్డి, కొనుకటి మల్లారెడ్డి, దొమ్మటి శ్రీనివాస్, గోనే శ్యామ్, మర్రి సంగీత మహేందర్, దాసరి లావణ్య రమేష్ ఉన్నారు.

డాక్టర్‌పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామాల ప్రజలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 2: ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో మండల ప్రజలు కాల్వశ్రీరాంపూర్-సుల్తానాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. డాక్టర్ మహేందర్‌పై దాడి చేసిన వ్యక్తులను ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. సుమారు గంటపాటు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టడంతో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి ఏఎస్ఐ నీలిమ చేరుకొని నిందితులను త్వరలో పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుండగులను పోలీసులు గుర్తించి అరెస్టు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆరెల్లి రమేష్, ఆటికం శంకర్, పోషల సదానందం, పొట్యాల మొండయ్య, సుధాటి కర్ణాకర్‌రావు, బంగారు రమేష్, తాండ్ర కృష్ణ, శ్రీపతి మొగిలి, దాసరి నరేందర్, జిన్న రామచంద్రంరెడ్డి, శ్రీశైలం గౌడ్, కొత్తూరి మొండయ్య తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మంథని, ఆగస్టు 2: మండలంలోని లక్కెపూర్ గ్రామంలో ఇటీవల కొండపర్తి రాంబాయి మృతిచెందగా ఆమె దశదిన కర్మకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శుక్రవారం హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, ఎక్కేటి అనంతరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముత్తారం ఆగస్టు 2: మండలంలోని లక్కారంలో ఇటీవల మృతిచెందిన నాయిని ధర్మతేజరెడ్డి కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శుక్రవారం పరామర్శించారు. వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, కాపురవేన భాస్కర్, వేగోలపు మల్లయ్య, దేవ శ్రీనివాస్, ఆసం తిరుపతి, నాగమల్లు, కాట అనిల్ ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 2: టీబీజీకేఎస్ మాజీ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య కుటుంబాన్ని శుక్రవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. గౌతమ్ శంకరయ్య తల్లి అమృతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మండలంలోని పెగడపల్లిలో ఆయన స్వగృహంలో అమృతమ్మ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, నాయకులు కాపురవేన భాస్కర్, వేగోలపు మల్లయ్య, దేవ శ్రీనివాస్, ఆసం తిరుపతి, బుర్ర ముత్యాలు, పాముల శేషగిరి, పూర్ణచ్చందర్, కాట అనిల్ ఉన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 2: గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం పరిధి జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 31 స్కానింగ్ కేంద్రాలు రిజిస్టర్ అయ్యాయని, మూడు నెలలుగా జిల్లాలోని 12స్కానింగ్ సెంటర్లను తనిఖీచేసి 42ఫారం ఎఫ్‌లను ఆడిట్ చేశామన్నారు. సమావేశంలో ఐఆర్‌సీఎస్ జిల్లా కన్వీనర్ కావేటి రాజగోపాల్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవీందర్, వెంకటేశ్వర్లు, డాక్టర్ వాణిశ్రీలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు: సీఐ



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ రాజు

రామగిరి, ఆగస్టు 2: గ్రామాల్లో అసాంఘిక చర్యలకు పాల్పడతే కఠిన చర్యలు తీసుకుంటామని మంథని సీఐ రాజు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బేగంపేట్ గ్రామంలో రామగిరి, ముత్తారం ఎస్ఐలు సందీప్, మధుసూదన్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామంలో స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సరైన ధ్రువపత్రాలులేని వాహనాలను గుర్తించి చలాన్లు వేశారు. మైనర్‌లకు వాహనాలు ఇచ్చి కష్టాలను కొనితెచ్చుకోవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మహిళలపై అనుచిత వైఖరి ప్రదర్శించినట్లైయితే తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా తక్షణం 100 డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళా ఎమ్మెల్యేపై సీఎం మాటలు సరికాదు

ముత్తారం ఆగస్టు 2: శాసనసభలో ఒక మహిళ ఎమ్మెల్యేను కించపరిచినట్టు, అగౌరవపరిచినట్టు మాట్లాడడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు సరికావని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎవరూ మహిళా ప్రజాప్రతినిధులను అగౌరపరుస్తు మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ స్థానం దక్కించుకున్నాడని ఎద్దేవ చేశారు. వెంటనే ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో ఉన్న తండ్రిని చేరదీయాలి

జ్యోతినగర్, ఆగస్టు 2: అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని చేరదీయాలని వీపీసీసీ హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మహేందర్ శుక్రవారం కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ చేశారు. స్థానిక అన్నపూర్ణ కాలనీకి చెందిన తోట వెంకట్ కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధ పడుతున్నాడు. రెండు రోజుల క్రితం కరీంనగర్‌లో చికిత్స తీసుకున్న వెంకట్ తన కొడుకు ఇంటికి వచ్చాడు అయితే వెంకట్ కొడుకు తండ్రిని చేరదీయడానికి అతని భార్య, మనవడు సూర్య నిరాకరించారు. విషయం తెలుసుకున్న వెంకట్ తమ్ముడు హ్యూమన్ రైట్స్ కమిటీకి సమాచారం ఇచ్చాడు. ఈ క్రమంలో ఎన్టీపీసీకి వచ్చిన కమిటీ సభ్యులు వెంకట్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అయితే వెంకట్‌ను ఇంట్లో ఉంచడానికి భార్య, కొడుకులు ఒప్పుకోలేదు. తనకున్న అప్పులను తీర్చితేనే చేరదీస్తామని హ్యూమన్ రైట్స్ సభ్యులకు తెలిపారు. బాధితుడి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్న హ్యూమన్‌రైట్స్ కమిటీ సభ్యులు వెంకట్‌కు భోజనం తినిపించి వెళ్లిపోయారు.

ఐటీఐలో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 2: పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో(ఐటీఐ) ఆగస్టు 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు మిగిలి ఉన్న సీట్ల కోసం మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్, కన్వీనర్ బుసిరెడ్డి, వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్సెస్సీ మెమో, టీసీ, బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు ఇతర ధ్రువపత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఈ నెల 2వ తేదీ నుంచి 12వ తేదీవరకు ఐటీఐ తెలంగాణ. గోవ్.ఇన్ వెబ్‌సైట్‌లో వెరిఫికేషన్ ఫీజు 100 చెల్లించి అభ్యర్థులు దరఖాస్తుకోవాలని సూచించారు

పంచాయతీ అధికారులపై 'ఈద' ఆగ్రహం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 2: మండలంలో నెల రోజుల నుంచి ప్రజలు పారిశుధ్య లోపంతో విషజ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పంచాయతీ అధికారులపై రాష్ట్ర ఐడీసీ మాజీ చైర్మన్ ఈదశంకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగారం, మొట్లపల్లి, జాఫర్‌ఖాన్‌పేటతో పాటు పలు గ్రామాల్లో విష జ్వరంతో మృతి చెందిన సంఘటనను ఈద శంకర్‌రెడ్డి అదనపు కలెక్టర్ అరుణశ్రీ దృష్టికి తీసుకువెళ్లి వివరించారు. పంచాయతీ అధికారులు గ్రామాల్లో శానిటేషన్ నిర్వహించాలని, మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, ఫాగింగ్ నిర్వహించాలని జిల్లా అధికారులకు సూచించినట్లు ఈద శంకర్‌రెడ్డి తెలిపారు.

రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలి

సుల్తానాబాద్, ఆగస్టు 1: కొత్తగా వ్యవసాయ పాస్ బుక్కులు పొందిన రైతులు రైతు బీమా ప్రయోజనం పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ విస్తీరణ అధికారి ప్రశాంత్ రైతులకు సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని కనుకుల రైతు వేదిక వద్ద ఆయన శుక్రవారం పలువురు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జూన్ 28 వరకు పాస్‌బుక్ పొందిన రైతులు, 18 సంవత్సరాల నుంచి 59 ఏళ్ల వయస్సు గల రైతులు రైతు బీమా పథకానికి అర్హులని తెలిపారు.

మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో రవీందర్ రాథోడ్

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 2: వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను పరిరక్షించే బాధ్యతను అందరూ తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాఘవపూర్ ప్రధాన రహదారికి ఇరువైపులా పంచాయతీ అధికారులు మొక్కలు నాటుతుండగా జిల్లా గ్రామీణాభివృద్ధికారి రవిందర్ రాథోడ్ పరిశీలించారు. ప్రతీ మొక్కకు మధ్య మీటర్ దూరం ఉండాలని, మొక్కలు నాటే క్రమంలో విద్యుత్ తీగలు లేకుండా వాటి కింద నాటకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్ సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటికి రక్షణగా ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. వారి వెంట అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తూముల రవి, విజిలెన్స్ అధికారి గణేష్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌లు వెంకటేష్, దివ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్ పాల్గొన్నారు.

ర్యాకల్‌దేవ్‌పల్లిలో వైద్య శిబిరం

ఎలిగేడు, ఆగస్టు 2: మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి రకరకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేసి పలు సూచనలు, సలహాలు అందించారు. వర్షకాలం సీజన్‌లో పరిస్థితులకు అనుకూలంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు నిస్సీక్రిష్టాన, సిహెచ్‌వో విజేందర్‌రావు, సూపర్‌వైజర్ లక్ష్మణ్, నాగరాణి, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తపడాలి

ఎలిగేడు, ఆగస్టు 2: ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో భాస్కర్‌రావు. జీవీ మహేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా వారు ఎలిగేడు, ర్యాకల్‌దేవ్‌పల్లి, సుల్తాన్‌పూర్ గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎపీఎం సుధాకర్, ఏవో ఉమాపతి, పిహెచ్‌సి డాక్టర్ నిస్సిక్రిష్టాన, పంచాయతీ కార్యదర్శులు అంజలి, ప్రమోద్‌కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



జీడీకే 2ఇంక్లైన్ ప్రమాదంపై చర్యలేవి..?

- హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

గోదావరిఖని, ఆగస్టు 2: జీడీకే 2ఇంక్లైన్‌లో జూలై 27న జరిగిన ప్రమాదానికి కారణమైన అధికారులపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆరోపించారు. శుక్రవారం జీడీకే 2ఇంక్లైన్ గనిని సందర్శించిన హెచ్‌ఎంఎస్ నాయకులు కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన మరుసటి రోజే జీఎం అండర్ మేనేజర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికీ ఆచరణలో ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేవని ఆరోపించారు. అదే అధికారులు ఇప్పటికీ గనిపై అధికారం చెలాయిస్తుంటే కార్మికుల మనోభావాలు ఎలా ఉంటాయన్నారు. తెలిసో తెలియకో చిన్న తప్పు చేస్తే కార్మికున్ని వెంటనే సస్పెండ్ చేసి విచారణ చేపట్టే అధికారులు, అధికారులు తప్పు చేస్తే మాత్రం ఎందుకు ఉపేక్షిస్తున్నారని రియాజ్ ప్రశ్నించారు. అధికారులకు, కార్మికులకు రెండు రకాల న్యాయాలు ఉంటాయా అని ఆయన అన్నారు. సీఎండీ సైతం బాధితులను ఆసుపత్రిలో పరామార్శించిన సందర్భంలో బాధ్యులైన అధికారులను బదిలీ చేస్తామని, చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చినప్పటికీ ఇంత వరకు ఏమి జరుగలేదని ఆయన అన్నారు. ప్రమాదానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోకపోతే యాజమాన్యంపై కార్మికవర్గానికి నమ్మకం పోతుందని రియాజ్ చెప్పారు. జీడీకే 2ఏ, 2ఇంక్లైన్‌లను మూసివేసే కుట్రలో భాగంగానే ఇలాంటి చర్యలకు యాజమాన్యం, అధికారులు పాల్పడుతున్నారని రియాజ్ అన్నారు. ఇందుకు డీజీఎంఎస్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జీడీకే ఓసీపీ-5 ఓబీ కారణంగానే ఉపరితలంపై ఒత్తిడి పెరిగి అండర్ గ్రౌండ్ బొగ్గు బావుల్లో రూఫ్ ఫాల్ అవుతున్నాయని, ఈ ప్రమాదాలకు మట్టికుప్పలే కారణమని రియాజ్ ఆరోపించారు. ఈ గేట్ మీటింగ్‌లో హెచ్‌ఎంఎస్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్జీ-2లో రాజిరెడ్డి జన్మదిన వేడుకలు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్ట్ 2: టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఆర్జీ-2 ఏరియా యూనియన్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఏరియా వైస్‌ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, బేతి చంద్రయ్య, అనిల్‌రెడ్డి, మల్లేశ్వరరావు, శ్రీనివాస్, నారాయణరెడ్డి, దాసరి శ్రీను, శ్రీకాంత్, రాకేష్, రాజు, రాజేశం, వెంకటేష్, లెనిన్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

జియో థర్మల్ వైపు అడుగులు..

- అన్వేషణ, అభివృద్ధిపై త్రైపాక్షిక ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న మూడు సంస్థ ప్రతినిధులు

గోదావరిఖని, ఆగస్టు 2: సింగరేణి సంస్థ మరో ప్రయోగాత్మక విద్యుత్ ఉత్పత్తి కోసం అడుగులు వేస్తున్నది. జియో థర్మల్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నది. మణుగూరు కేంద్రంగా జియో థర్మల్ అన్వేషణకు పూనుకున్నది. దేశంలో అతిపెద్ద జియో థర్మల్ ఉత్పత్తి కేంద్రంగా మణుగూరు మారనున్నది. మణుగూరుకు సమీపంలో పగిడేరు వద్ద భూగర్భంలో విస్తారంగా ఉన్న జియో థర్మల్ క్షేత్రం అన్వేషణ, అభివృద్ధిపై శుక్రవారం సింగరేణి కాలరీస్ కంపెనీ, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఎన్‌జీసీ), తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జి కార్పొరేషన్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. సింగరేణి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ బలరాం, ఓఎన్‌జీసీ డైరెక్టర్(ఎక్స్‌ప్లోరేషన్) సుష్మరావత్, తెలంగాణ రెడ్‌కో జీఎం సత్యవరప్రసాద్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ మణుగూరులో 122మెగావాట్ల జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉందని జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించిందన్నారు. సింగరేణి సంస్థ పునరుత్పాదక ఇంధనవనరుల వినియోగం దిశగా ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. అన్ని సంస్థలు వ్యాపార విస్తరణల కోసం ఇతర సంస్థలతో కలిసి పనిచేస్తూ ముందుకు వెళుతున్నాయని, ఇందులో భాగంగానే మణుగూరు జియో థర్మల్ క్షేత్ర అన్వేషణలో ఓఎన్‌జీసీ, తెలంగాణ రెడ్‌కో కలిసి పని చేస్తున్నామన్నారు. ఓఎన్‌జీసీ డైరెక్టర్ సుష్మరావత్ మాట్లాడుతూ మణుగూరు దేశంలో అతిపెద్ద జియో థర్మల్‌కేంద్రంగా మారుతుందని, ఇక్కడ జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి పూర్తి అనువైన వాతావరణం ఉందని చెప్పారు. మరింత అన్వేషణ జరిగితే జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తే కాకుండా హీలియం వెలికి తీసేందుకు కూడా అవకాశాలున్నాయన్నారు. ఇప్పటికే సింగరేణి, తెలంగాణ రెడ్‌కో క్షేత్రస్థాయి సర్వేలు నిర్వహించినట్టు చెప్పారు. రెడ్‌కో జీఎం సత్యవరప్రసాద్ మాట్లాడుతూ క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంస్థలను ముందుకు తీసుకెళుతుందన్నారు. మణుగూరులో చేపట్టే ఈ ప్రాజెక్టు విజయవంతం అయితే దేశంలోనే తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం ప్రతిపాదిత గోదావరి జియో థర్మల్ ఎనర్జి ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వ మహారత్న సంస్థ అయిన ఓఎన్‌జీసీ మణుగూరు ప్రాంతంలో జియో థర్మల్ విస్తరించి ఉన్న భూ అంతర్ భాగంలో పరిశీలన, అన్వేషణ జరిపిందని చెప్పారు. ఈ ప్రాంతంలో జియో థర్మల్ విద్యుత్ ఉత్పాదన కేంద్రాల ఏర్పాటుకు గల అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక ఇస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర అటవీశాఖ సహకారం కోరుతూ ఒక ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. తెలంగాణ రెడ్‌కో నోడల్ సంస్థగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు, చట్టబద్ధ సంస్థల నుంచి అనుమతులు పొందడానికి సహకారం అందిస్తున్నదన్నారు. సింగరేణి సంస్థ లాజిస్టికల్ సహకారం అందిస్తున్నదని, ఓఎన్‌జీసీ గత కొన్నేళ్లుగా మణుగూరులో చేస్తున్న అధ్యయనానికి సింగరేణి సహకరిస్తూ వస్తున్నదన్నారు. మణుగూరు ప్రాంతంలో భూగర్భం నుంచి ఉబికి వచ్చే వేడి నీటితో విద్యుత్ ఉత్పాదన కోసం కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ సహకారంతో సింగరేణి సంస్థ ఇప్పటికే ప్రయోగాత్మకంగా 20కిలో వాట్ల ప్లాంట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో పది భూతాప ప్రాంతాల్లో 381 భూతాప ప్రదేశాలను గుర్తించామని, మణుగూరు భూతాప క్షేత్రం అత్యంత ఆశాజనకంగా ఉందన్నారు. దేశంలో ఇతర భూతాప కేంద్రాలకు సరైన రవాణా సౌకర్యం లేదని, మణుగూరు పగిడేరు ప్రాంతానికి ఇప్పటికే రవాణా సౌకర్యం ఉన్నందున, రవాణాకు ఇబ్బంది లేకుండా ఉందన్నారు. ఇతర ప్రాంతాలను పోల్చితే ఇక్కడ తక్కువ పెట్టుబడితో భూతాప విద్యుత్ ఉత్పత్తి కంపెనీ సాధ్యమవుతుందన్నారు. అంతేకాకుండా ఇక్కడికి అతి సమీపంలో ఉన్న భద్రాద్రి థర్మల్ ప్లాంట్ గ్రిడ్ ద్వారా విద్యుత్ అనుసంధానానికి కూడా ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. పరిశోధనల్లో మణుగూరు ప్రాంతంలో 3,500మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉన్నట్టు నివేదికలు వెల్లడించాయన్నారు. వాస్తవ అవకాశాలను తేల్చేందుకు ఈ అనేషణ దోహదపడుతుందని చెప్పారు. 2070నాటికి సంపూర్ణ కార్బన్ ఉద్గార రహిత విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని దేశం లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఇలాంటి పర్యావరణ హిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు ఓఎన్‌జీసీ, సింగరేణి, కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం సుభాని, దేవేందర్, ఓఎన్‌జీసీ పక్షాన జీఎం గోపాల్ జోషి, జీఎం సంజయ్‌కుమార్ ముఖర్జి, చీఫ్ మేనేజర్ రమేష్ సాట్ల, అనూప్ భరద్వాజ్ పాల్గొన్నారు.